క్లుప్తంగా

ఆస్పత్రిలో ధరలు ప్రదర్శించాలి

జగిత్యాల: ప్రైవేటు ఆస్పత్రిలో ధరలు ప్రదర్శించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను గురువారం తనిఖీ చేశారు. ప్రతి ఆస్పత్రిలో వచ్చే రోగులకు తెలిసేలా ఫీజు బోర్డులు ఏర్పాటు చేయాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి విభాగానికి సంబంధించిన రేటు ఉండాలని, అత్యధిక ఫీజులు తీసుకోవద్దని హెచ్చరించారు.

జ్వరాల అదుపునకు సహకరించాలి

సారంగాపూర్: జ్వరాల అదుపునకు ప్రజల సహకారం తప్పనిసరి అని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెంబట్లలో రెండోరోజు కూడా వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇళ్లలో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. నీరు పారబోయడానికి ప్రజలు సహకరించకపోవడం విచారకరమన్నారు. అనంతరం ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ శివకుమారి, సీహెచ్‌వో కుద్దుస్, మలేరియా అధికారి సత్యనారాయణ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు ఉన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల: క్రిప్టో కరెన్సీ మల్టీలెవల్ మార్కెటింగ్‌లో నిమగ్నమై విధులను నిర్లక్ష్యం చేస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాడవేని సునీల్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. అధిక సంపాదన కోసం ఈ వ్యాపారంలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. పేద పిల్లలు భవిష్యత్‌పై ఎంతో ఆశతో వస్తుంటే.. మాస్టర్లు ఇలాంటి దందాలు చేపడుతున్నారని వాపోయారు. నిఖిల్, జస్వంత్, రోషన్, అభిషేక్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన వాయిదా

జగిత్యాల: ఎస్‌కేఎన్‌ఆర్ ఆర్ట్స్ సైన్స్ కళాశాల జగిత్యాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు గతంలో ప్రకటించినట్లుగా సెప్టెంబర్ 6న కాకుండా ధ్రువీకరణ పత్రాల పరిశీలన సెప్టెంబర్ 11కు వాయిదా వేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సీఎం హామీ

జగిత్యాల: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సీఎం హామీ ఇచ్చారని ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ బోగ శశిధర్, జనరల్ సెక్రటరీ గంగుల సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సీఎం హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇటీవల వర్షాలకు ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ జగదీశ్వర్, సెక్రటరీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఉద్యోగుల ఒకరోజు వేతనం స్వయంగా సీఎం సమక్షంలో ప్రకటించిన తర్వాత అనేక సంఘాలు హర్షిస్తున్న తరుణంలో లచ్చిరెడ్డి రూ.100కోట్లు విరాళం తాను ఇప్పించినట్లుగా ప్రకటన చేయడం ఖండిస్తున్నామన్నారు. జిల్లా జాయింట్ కమిటీ నాయకులు నాగేందర్, రమేశ్, హరి అశోక్‌కుమార్, వకీల్, జితేందర్‌రెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

సమాజ సేవ చేయాలి

సారంగాపూర్: ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సమాజ సేవలో కొనసాగాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేసి విరమణ పొందిన సజ్జనపు రాజమౌళి దంపతులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

రాయికల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు గైర్హాజరు కావడంతో.. గురువారం లెక్చరర్లు వారి ఇంటికెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. హాజరయ్యేలా చూడాలని కోరారు. ప్రిన్సిపాల్ రాజేశ్, లెక్చరర్లు చౌడారపు శ్రీనివాస్, రవీందర్, రహీం, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీడీ ఆవిష్కరణ

కోరుట్ల రూరల్: నాగులపేటలో దర్వాజ ఫోక్ సాంగ్స్ యూట్యూబ్ చానల్ సీడీని గురువారం ఆవిష్కరించారు. గ్రామంలోని పారిశుధ్య కార్మికుల చేతుల మీదుగా ఈ యూట్యూబ్ అల్బమ్ సీడీని ఆవిష్కరించినట్లు రచయిత లింగంపెల్లి నరేశ్ తెలిపారు. మాజీ సర్పంచ్ కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాగులమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ భీమలింగం, నాయకులు నవీన్‌రెడ్డి, రాజేశ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బిల్లులు విడుదల చేయాలి

మల్లాపూర్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకన విధులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్(711) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంచర్ల రాజేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలు

మేడిపల్లి: మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 2024–2025 విద్యాసంవత్సరానికి సంబంధించి జూనియర్ ఇంటర్‌లో ఖాళీలకు స్పాట్ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. శుక్ర, శనివారాల్లో ఎంపీసీ, బైపీసీ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



మల్లాపూర్‌లోని వికాస్ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులుగా విద్యార్థులు



పెగడపల్లి: నందగిరిలో నివాళి అర్పిస్తున్న విద్యార్థులు



రాయికల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కస్తూర్బా పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులను సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్



ధర్మపురిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం



సారంగాపూర్ జూనియర్ కళాశాల అధ్యాపకులను సన్మానించిన నాయకులు



ఇబ్రహీంపట్నం హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు



జగిత్యాలరూరల్: నందెల్లి మదన్‌మోహన్‌రావును సన్మానిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



గొల్లపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విప్ సతీమణి కాంతాకుమారి



కోరుట్ల పాఠశాలలో..



కథలాపూర్: చింతకుంటలో ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

వినాయక చవితికి సిద్ధం

పెగడపల్లి: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుపుకునేందుకు గ్రామాలు సిద్ధమయ్యాయి. ఆయా గ్రామాల కూడళ్లలో గణపయ్య కొలువుదీరేందుకు మండపాలు సిద్ధం చేశారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 8 శివారు గ్రామాలున్నాయి. సుమారు 200 వరకు ప్రతిమల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నిబంధనలు పాటించాలి

వినాయక మండపాల వద్ద నిబంధనలు పాటించాలని ఎస్సై సీహెచ్ రవికిరణ్ సూచించారు. అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, రాత్రి మండపాల వద్ద నిర్వాహకులు అందుబాటులో ఉండాలన్నారు.

అవగాహన..

బుగ్గారం: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని శ్రీగ్లోబల్



పెగడపల్లిలో కొలువుదీరేందుకు సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహం

హైస్కూల్ ప్రిన్సిపాల్ డా.నక్క రాజు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో మట్టి గణపతుల ప్రాముఖ్యం అనే అంశంపై స్థానిక విద్యార్థులకు అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న డా.నక్క రాజు

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

వెల్గటూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి సూచించారు.

శానిటేషన్ చేపట్టాలి

జగిత్యాల: వినాయక చవితి సందర్భంగా శానిటేషన్ చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. గురువారం పలు కాలనీల్లో పర్యటించారు.

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ

పెగడపల్లి: వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని బతికపల్లి మాజీ సర్పంచ్ తాటిపర్తి శోభారాణి, ఆయుష్ కేంద్రం డాక్టర్ వినయకుమారి ప్రజలను కోరారు.

నేడు శాంతి సమావేశం

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో వినాయక మండపాల నిర్వాహకులతో శుక్రవారం ఉదయం 9 గంటలకు శాంతి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్సైలు దత్తాద్రి, కుమారస్వామి తెలిపారు.

త్యాగం చేశాం.. కనికరించండి

- మిగిలిన డబుల్ బెడ్‌రూం ఇళ్లనైనా కేటాయించండి
- నూకపల్లి నిర్వాసితుల డిమాండ్
- 10 శాతం కేటాయించాలని మండల పరిషత్ తీర్మానం



నూకపల్లి శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

మల్యాల: సామాజిక అభివృద్ధితోనే అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు అందుతాయనే రాజ్యాంగ స్ఫూర్తితో మండల ప్రజలు రూ.కోట్ల విలువైన భూములు త్యాగం చేసి నిలువ నీడ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్లు, రైల్వేలు, నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం, వ్యవసాయానికి సాగునీటి కోసం వరద కాలువ తవ్వకాలకు మల్యాల మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ విలువైన భూములు నామమాత్రపు విలువకే త్యాగం చేశారు. తమ మల్యాల మండల ప్రజలకు డబుల్ బెడ్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని వేడుకుంటున్నారు.

2008లో..

నూకపల్లి గ్రామ రెవెన్యూ శివారులోని వందలాది ఎకరాల భూమిని 2008లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం నామమాత్రపు పరిహారం అందజేసి సేకరించారు. దీంతోపాటు ప్రభుత్వ భూములను సైతం స్వాధీనం చేసుకోవడంతో మండలంలోని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణానికి స్థలం లభించని పరిస్థితి నెలకొంది. నూకపల్లి గ్రామ శివారులోని 193 సర్వే నంబర్‌లోని సుమారు 160 ఎకరాలకు పైగా పట్టా భూములు, మరో సుమారు 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములను సేకరించి జగిత్యాల మున్సిపాలిటీకి పరిధిలోకి తీసుకెళ్లారు. నూకపల్లి గ్రామ శివారులోని పట్టా భూములు, ప్రభుత్వ భూములతోపాటు జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ శివారులోని ప్రభుత్వ భూముల్లో డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణం కోసం నిర్మాణం చేపట్టారు. 90 శాతం నూకపల్లి గ్రామ రైతుల నుంచి సేకరించిన పట్టా భూముల్లోనే నిర్మాణాలు చేపట్టారు. నర్సింగాపూర్ శివారులోని ప్రభుత్వ భూముల్లో మరికొన్ని డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. 4,520 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించగా.. ఇప్పటికే 3,720 ఇళ్లు నిరుపేదలకు కేటాయించారు. మిగిలిన ఇళ్లను మండలంలోని నిరుపేదలకు కేటాయించాలి. నూకపల్లి శివారులోని ప్రభుత్వ భూముల్లో ఇప్పటికే జగిత్యాల సబ్ జైల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించారు. అర్బన్ హౌసింగ్‌కాలనీని తాగునీరు కోసం నిర్మించే నీటి ట్యాంకును మొదలుకొని 90 శాతం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు నూకపల్లి శివారులోనే చేపట్టారు. నర్సింగాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో 10 శాతం మాత్రమే చేపట్టారు. నూకపల్లి శివారులో పద్మనాయక సంక్షేమ సంఘానికి ఎకరానికి పైగా ప్రభుత్వ స్థలం కేటాయించారు.

మండల పరిషత్ సమావేశంలో తీర్మానం

నిరుపేదలకు 10 శాతం ఇళ్లు కేటాయించాలని కోరుతూ 2023లో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవ తీర్మానం చేశారు.

నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలి



నూకపల్లి గ్రామ రైతులు తమ పట్టా భూములు నామమాత్రపు విలువకే త్యాగం చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తిగా నూకపల్లి గ్రామ రైతుల నుంచి సేకరించిన భూముల్లోనే చేపట్టారు. మండలంలోని నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలి.

– నులుగొండ సురేశ్, రైతు, నూకపల్లి

భూములు త్యాగం చేసినం



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరిట విలువైన పంట భూములు త్యాగం చేసినం. పట్టా భూముల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం సాగు చేసే ఎకరం భూమి కోల్పోయినం. భూములు త్యాగం చేసినందుకు మండలంలో నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి.

– రంగినేని మల్లవ్వ, నూకపల్లి గ్రామ రైతు

10 శాతం కేటాయించాలి



నూకపల్లి గ్రామ రైతులతోపాటు మల్యాల ప్రభుత్వ రెవెన్యూ భూములు ఇళ్ల నిర్మాణం కోసం త్యాగం చేసినం. మండలంలో వందలాది మంది ఇల్లు లేని నిరుపేదలున్నారు. వారి స్థితిగతులను పరిగణనలోకి తీసుకొని మండలానికి 10 శాతం డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి.

– తాళ్ల హరినాథ్, ముత్యంపేట

సంక్షిప్త వార్తలు

తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యం

జగిత్యాల: తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యమని సీడీపీవో మమత అన్నారు. పోషణ మాసం సందర్భంగా పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు.

ఎల్ఐసీ వార్షికోత్సవం

మెట్‌పల్లి: ఎల్ఐసీ వార్షిక వేడుకలను గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఎల్ఐసీ కార్యాలయం నుంచి సిబ్బంది పుర వీధుల గుండా ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ రామ్‌శర్మ, ఏబీఎస్ నర్సయ్య, అజయ్‌కుమార్, అనిల్, శ్రీకాంత్, విశాల్ తదితరులున్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడొద్దు

కోరుట్ల: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ఎవరూ వాడొద్దని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. పట్టణంలోని పలు ప్లాస్టిక్ ఏజెన్సీలు, దుకాణాల్లో గురువారం మున్సిపల్ అధికారులు తనిఖీలు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని రూ.5వేలు జరిమానా విధించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలె అశోక్, అధికారులు రాజయ్య, ప్రసాద్, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గండి పూడ్చివేత

మల్యాల: నూకపల్లి శివారులో వరద కాలువ వంతెన సమీపాన ఇటీవల కురిసిన వర్షాలతో దారి కోతకు గురైంది. గురువారం నీటి పారుదల శాఖ డీఈఈ ఆదేశాలతో కోతకు గురైన ప్రదేశంలో మట్టి పోసి గుంతను పూడ్చివేశారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, లష్కర్ శంకర్ నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సారంగాపూర్: సారంగాపూర్ మండలంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, బీర్‌పూర్ మండలంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏడీఈ హరీశ్, ఏఈలు సతీశ్, శ్రీనివాస్ తెలిపారు.

పుస్తకాలు పంపిణీ

మల్యాల: తక్కలపల్లి మండల పరిషత్ పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు శంకర్ గురుకుల ప్రవేశ పరీక్ష పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు.

ఆర్థిక సాయం

మల్లాపూర్: రత్నాపూర్‌కు చెందిన దేవరాణి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుందనే విషయం తెలుసుకొని 2002–03 బ్యాచ్ పూర్వ విద్యార్థులు గురువారం రూ.27వేలు అందజేశారు.

వేంపల్లిలో గల్ఫ్ బాధిత కుటుంబానికి వీవీరావుపేట గల్ఫ్ సంఘం ఆధ్వర్యంలో రూ.11వేల ఆర్థిక సాయాన్ని అందించారు. వేంపల్లి గ్రామానికి చెందిన కలాలి ధర్మరాజు గల్ఫ్ దేశానికి వలస వెళ్లగా.. అతడి భార్య నవీన అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమన్నారు.



బుగ్గారం: ధర్మపురి పట్టణంలోని జాతీయ రహదారి పక్కన గల డ్రైనేజీలో మురుగు పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో స్థానికులు, కళాశాల విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డ్రైనేజీ సరిగా నిర్మించకపోవడంతో మురుగు నీరు ప్రవహించకుండా నిల్వ ఉంటోంది. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముంది. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– బక్కశెట్టి గణేశ్, ధర్మపురి

ఈ సమస్యపై సంప్రదించాల్సిన అధికారి
గంగాధర్, ధర్మపురి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, సెల్ నం.: 8886649053

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా లావణ్య



లావణ్య



సంతోష్

ధర్మపురి: ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం నియామకం చేపట్టారు. 18 మంది సభ్యులుండగా.. చైర్‌పర్సన్‌గా చిలుముల లావణ్య(నాగారం), ఉపాధ్యక్షుడిగా సంగ నర్సింహులు(దోనూర్)తో పాటు 16 మంది సభ్యులుగా కొనసాగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గంధం రాజయ్య, వాడు కోటి గీతాంజలి, ఎండీ రఫియోద్దీన్, మెరుగు పరశురామ్, తోటి రాజయ్య, ఎన్నం మధూకర్‌రెడ్డి, తాండ్ర అశోక్‌రావు, అనుగు జోగిరెడ్డి, రామడుగు రవి, కాశెట్టి రాజేశ్, గునిశెట్టి అంజయ్య, దైత శ్రీనివాస్, తిమ్మాపూర్ సింగిల్‌విండో అధ్యక్షుడు, జిల్లా మార్కెటింగ్ అధికారి, ధర్మపురి వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌ను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

గొల్లపల్లి మార్కెట్ కమిటీ..

గొల్లపల్లి: గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ఏర్పాటుకు ప్రభుత్వం కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్‌గా భీమ సంతోష్, వైస్ చైర్మన్‌గా పురపాటి రాజిరెడ్డి, డైరెక్టర్లుగా కొక్కుల జలేందర్, ఓరుగంటి తిరుపతి, వూటూరి అనూష, జక్కుల దస్తగిరి, గుంటుకుల నర్సయ్య, వూట్కూరి సురేందర్‌రెడ్డి, నక్క రాజయ్య, అత్తెన శివయ్య, జేరిపోతుల కొంరయ్య, ఎస్‌కే గంగామియా, కట్ట లక్ష్మణ్‌రావు, చాడ సత్తయ్య నియామకమయ్యారు.

బాధ్యతతో పని చేయాలి

ఇబ్రహీంపట్నం: బాధ్యతతో పని చేస్తూ రైతులకు అండగా ఉండాలని మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మాజీ జెడ్పీటీసీలు ఆకుల లింగారెడ్డి, కొక్కు పురుషోత్తం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు. సింగిల్‌విండో మాజీ చైర్మన్ శంకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు మాధవరెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ సుగుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా మునీందర్

పెగడపల్లి: పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా ఎలుగు మునీందర్ ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికలు గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్ ఆవరణలో జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా సుధగోని శ్రీధర్, అసోసియేట్ అధ్యక్షుడిగా సంకిటి ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శిగా వేల్పుల శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షులుగా రంగోజు మంజుల, కార్యదర్శిగా అశ్విని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాయికల్: పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా అంతడుపుల గంగరాజం, ప్రధాన కార్యదర్శిగా రాపర్తి నర్సయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా దొంతి సతీశ్, ఉపాధ్యక్షులుగా కడకుంట్ల అభయ్‌రాజ్, శోభ, కార్యదర్శిగా చెట్‌పల్లి బాపురావు, తరంగిణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేశ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కన్నవేని మల్లారెడ్డి తెలిపారు.



పెగడపల్లి: పీఆర్టీయూ మండల బాధ్యులు

సారంగాపూర్: పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మానేరు శంకరయ్య(కోనాపూర్ ఉన్నత పాఠశాల), ప్రధాన కార్యదర్శిగా సంగ శ్రీధర్(ఒడ్డెరకాలనీ), అసోసియేట్ అధ్యక్షుడిగా రాజనర్సయ్య(అర్పపల్లి), కార్యదర్శిగా ఉమేశ్(లక్ష్మీదేవిపల్లి), మహిళా కార్యదర్శిగా గోలి నిర్మల(రంగపేట) ఎన్నికయ్యారు.

విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సాయిరాంచారి



మల్లాపూర్: విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజోజి సాయిరాంచారి నియామిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ కవి విశ్వనాథుల పుష్పగిరి గురువారం ఉత్తర్వులు జారీ చేసి అందజేశారు.

కల్లూర్ వంతెనకు మరమ్మతు షురూ..

కోరుట్ల రూరల్: కల్లూర్ శివారులోని వాగుపై ఉన్న లోలెవల్ వంతెన వాగు ఉధృతికి కొంతమేర కొట్టుకుపోయింది. దీంతో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తెగిన వంతెనను బుధవారం సందర్శించి కలెక్టర్‌తో మాట్లాడారు. వంతెన తెగిపోవటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని, వెంటనే మరమ్మతు చేయించాలని కోరారు. కలెక్టర్ ఆదేశాలతో వంతెన తెగిన ప్రాంతంలో గురువారం కాంక్రీట్ డస్ట్ పోసి జేసీబీతో చదును చేశారు. సీసీ రోడ్డు వేస్తామని అధికారులు తెలిపారు.

మేకలు, గొర్రెలకు టీకాలు వేయించాలి



గొర్రెకు టీకా వేస్తున్న పశు వైద్యాధికారిణి మనీషా

మెట్‌పల్లిరూరల్: నాలుగు నెలల వయసు దాటిన మేకలు, గొర్రెలకు పీపీఆర్ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి మనీషా అన్నారు. ఆరపేట, మేడిపల్లి గ్రామాల్లో గురువారం మేకలు, గొర్రెలకు పారుడు రోగ నివారణ టీకాలు వేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ బక్కయ్య సందర్శించి పలు వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది రమ, మురళి, రమణయ్య, చిరంజన్, మోహన్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మూగజీవాల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశు వైద్యాధికారి డాక్టర్ అశోక్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండలం ముత్యంపేట పశు వైద్యశాలలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువుల్లో పారుడు రోగం నివారణ కార్యక్రమంలో పాల్గొన్నారు.